సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 15 । నవంబర్ । 2024



పెంచిన నారుకే మొగ్గు

మారుతున్న కాలానికి అనుగుణంగా సాగు విధానంలో రైతులు కొత్త ఒరవడికి శ్రీకారం చుడుతున్నారు.

8లో▸



నిబంధనలు తప్పనిసరి

రోడ్డుపైకి వచ్చే ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని పోలీసులు పేర్కొన్నారు.

8లో▸



మహిళాభివృద్ధికి కృషి

అతివల అభివృద్ధికి కృషి చేయాలని సీపీఐ మహిళా సమైక్య జిల్లా గౌరవ అధ్యక్షురాలు నీలమ్మ పేర్కొన్నారు.

8లో▸

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ డీఎం

మహేశ్వరం: ప్రయాణికుల కోసం శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మహేశ్వరం డిపో మేనేజర్ లక్ష్మీసుధ తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు నిర్వహించే కార్యక్రమంలో ప్రయాణికులు తమ సమస్యలు దృష్టికి తీసుకురావచ్చని, సలహాలు, సూచనలు చేయొచ్చని చెప్పారు. 91542 98784 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'పట్నం' పరిధిలో..

ఇబ్రహీంపట్నం: శుక్రవారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ వెంకటనర్సప్ప గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిపో పరిధిలోని ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు, సమస్యల కోసం 73829 24900 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'ధరణి' దరఖాస్తులు త్వరగా పరిష్కారం కావాలి

కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న 7,600 దరఖాస్తులను వచ్చే రెండు నెలల్లో పరిష్కరించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, సెక్షన్ సూపరింటెండెంట్స్‌తో కలిసి పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ మాడ్యూల్స్ కింద దాఖలైన దరఖాస్తులను రెండు నెలల్లో పరిష్కరించాలని సూచించారు. రోజు వారీగా లక్ష్యాన్ని నిర్దేశించుకొని జనవరి 15 లోపు పెండింగ్ జాబితాను పూర్తిగా క్లియర్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ సంగీత, ఏఓ సునీల్, రెవెన్యూ సెక్షన్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం కోసమే సహకార సంఘాలు



జెండా ఆవిష్కరించి వారోత్సవాలను ప్రారంభిస్తున్న కొత్తకుర్మ సత్తయ్య

తుర్కయంజాల్: సహకార సంఘాలు రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసమే పనిచేస్తున్నాయని రాష్ట్ర కో–ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘంలో గురువారం 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు వంగేటి లక్ష్మారెడ్డి, సామ సంజీవ రెడ్డి, సీఈఓ వై.రాందాసు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడి సన్నిధిలో రామగుండం సీపీ



సీపీ శ్రీనివాస్‌కు స్వాగతం పలుకుతున్న కౌన్సిలర్ సభ్యుడు కిషోర్

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ వేంకటేశ్వర స్వామిని గురువారం రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సీపీకి మున్సిపల్ కౌన్సిలర్ సభ్యుడు ఒగ్గు కిషోర్ బొకే అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సీపీ ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మైసిగండి.. జాతరండి

మైసిగండిలో కొలువైన మైసమ్మ తల్లి జాతర శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఉత్సవాలను పురస్కరించుకుని ఇప్పటికే ఆలయాన్ని పచ్చటి మామిడి తోరణాలు, రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారికి క్షీరాభిషేకం, విశేష అలంకరణలు, కుంభహారతి సేవలు నిర్వహించనున్నారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

– కడ్తాల్



కొత్తగా విద్యుత్ అంబులెన్స్‌లు

మరో 101 వాహనాల కేటాయింపు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: విద్యుత్ సరఫరాలో సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం కొత్తగా మరో 101 ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం (అంబులెన్స్ తరహా) వాహనాలను సమకూర్చేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఏర్పాట్లు చేసింది. వచ్చే నెల 1 నుంచి ఈ వాహనాలు అందుబాటులోకి రానున్నాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇటీవల పది వాహనాలను ప్రారంభించిన విషయం తెలిసిందే. తాజాగా మరో 101 వాహనాలను సిద్ధం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగదారులకు సత్వర, నాణ్యమైన సేవలు అందించాలనే ఉద్దేశంతోనే వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు డిస్కం ప్రకటించింది. ప్రస్తుతం ఉన్న వాటికి అదనంగా మెట్రో జోన్‌కు 50, రంగారెడ్డి జోన్‌కు 21, మేడ్చల్ జోన్‌కు 19, రూరల్ జోన్‌కు 11 చొప్పున మొత్తం 101 వాహనాలను కేటాయిస్తూ దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఒక్కో డివిజన్‌కు ఒక వాహనం చొప్పున అందుబాటులోకి రానుంది. వాహనంలో షిఫ్ట్ విధానంలో ఒక అసిస్టెంట్ ఇంజినీర్, ముగ్గురు నైపుణ్యం కలిగిన సిబ్బంది, వాకీటాకీ, థర్మో విజన్ కెమెరాలతో పాటు, అత్యాధునిక భద్రతా పరికరాలైన హెల్మెట్, ఎర్త్ రాడ్, గ్లౌజులు, సేఫ్టీ బెల్ట్, కండక్టర్, ఎల్టీ/హెచ్‌టీ కేబుల్, స్పానర్ కిట్, 14 అడుగుల ఎత్తు నిచ్చెన, గొడ్డలి, రోప్, ఎల్టీ, హెచ్‌టీ ఫ్యూజ్‌వైర్, ఇన్సులేటర్, వుడ్ కట్టర్ వంటివి అందుబాటులో ఉంటాయి. వాహనంలో నలుగురు సిబ్బంది సహా, 100 కేవీఏ సామర్థ్యంతో కూడిన డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్‌ను సైతం తరలించడానికి అనుకూలంగా ఉంటుందని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ వెల్లడించారు.

మరింతగా సహకారం

జిల్లాలో పీఏసీఎస్‌ల పెంపు

- కొత్తగా 15 ఏర్పాటుకు రంగం సిద్ధం
- ఇప్పటికే సర్కార్‌కు డీసీసీబీ ప్రతిపాదనలు
- రైతులకు విస్తరించనున్న సేవలు



డీసీసీబీ కార్యాలయం

యాచారం: జిల్లాలో మరో 15 కొత్త పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార పరిపతి సంఘం)ల ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. ఈ మేరకు డీసీసీబీ (జిల్లా సహకార కేంద్ర బ్యాంకు) ఉన్నతాధికారులు ఏఏ మండలాల్లో, ఏ గ్రామాల్లో కొత్తవి ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలను సర్కార్‌కు పంపించారు. ప్రస్తుతం మొత్తం 37 పీఏసీఎస్‌లు ఉన్నాయి. వీటిల్లో సభ్యత్వం కలిగిన 1,26,173 మంది రైతులు ఉన్నారు. కొన్నేళ్ల క్రితం పీఏసీఎస్‌లు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత కొత్తవి ఏర్పాటు కాలేదు. కొన్ని మండలాల్లో ఒకటి, రెండు పీఏసీఎస్‌లు ఉండగా మరికొన్ని మండలాల్లో ఒక్కటే ఉంది. మేజర్ మండలాలైన యాచారం, మంచాల, కందుకూరు, మహేశ్వరం, ఆమనగల్లు, మాడ్గుల్ తదితర మండలాల్లో ఒక్కటి చొప్పునే పీఏసీఎస్ ఉంది. మేజర్ మండలాల్లో ఉన్న ఒక్కో పీఏసీఎస్ కింద 20 నుంచి 25 గ్రామాలు, 6 నుంచి 8 వేలకుపైగా రైతులు సభ్యులుగా ఉన్నారు.

కొత్త పీఏసీఎస్‌ల ఏర్పాటుతో..

కొత్త పీఏసీఎస్‌ల ఏర్పాటుతో రైతులకు ఎంతో మేలు జరగనుంది. మేజర్ మండలాల్లో మండల కేంద్రంలో ఉండే పీఏసీఎస్‌కు రైతులు వెళ్లాలంటే 20 నుంచి 25 కిలోమీటర్ల దూరం ఉంటుంది. కమర్షియల్ బ్యాంకులకు దీటుగా పీఏసీఎస్‌ల్లో సైతం దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలతో పాటు బంగారు తాకట్టుపై రుణాలు, గృహనిర్మాణం, ఉన్నత విద్య, వ్యక్తిగతం కింద రుణాలు విరివిగా అందజేస్తున్నారు. భవిష్యత్తులో పీఏసీఎస్‌ల ప్రాధాన్యత మరింత పెరిగే అవకాశం ఉండడంతో సర్కార్ కొత్త పీఏసీఎస్‌ల ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. కొత్త పీఏసీఎస్‌ల ఏర్పాటుతో రాజకీయ, నిరుద్యోగ సమస్య కూడా తీరనుంది. 15 పీఏసీఎస్‌ల ఏర్పాటుతో 195 డైరెక్టర్ల పోస్టులు భర్తీ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత 15 మంది కొత్త పీఏసీఎస్ చైర్మన్లు ఎన్నికవుతారు. కొత్త పీఏసీఎస్‌ల ఏర్పాటుతో అధిక నిధులతో రైతులకు మరింత మేలు జరిగి, ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుంది.

కొత్తగా ఏర్పాటయ్యే పీఏసీఎస్‌లు

మండలం	గ్రామం
మహేశ్వరం	సుభాన్‌పూర్
కందుకూరు	నేదునూర్
షాబాద్	తాళ్లపల్లి
మొయినాబాద్	పెద్ద మంగళారం
మంచాల	ఆరుట్ల
మాడ్గుల్	ఇర్విన్
ఆమనగల్లు	ముద్విన్
తలకొండపల్లి	వెల్జాల్
యాచారం	మాల్
ఫరూఖ్‌నగర్ (షాద్‌నగర్)	సోలిపూర్
కొందుర్గు	కొందుర్గు (పశ్చిమ)
కొత్తూరు (మేకగూడ)	కొత్తూరు
కేశంపేట (కొత్తపేట్)	అల్వాల్
చౌదరిగూడెం	చౌదరిగూడెం
కడ్తాల్	కడ్తాల్

సౌకర్యంగా ఉంటుంది



రంగారెడ్డి–నల్గొండ జిల్లాల సరిహద్దులోని యాచారం మండల పరిధిలోని మాల్‌లో కొత్త పీఏసీఎస్ ఏర్పాటు చేయడం సంతోషకరం. యాచారం పీఏసీఎస్‌కు వెళ్లాలంటే మా గ్రామం నుంచి 25 కిలోమీటర్లు వెళ్లాలి. మాల్ గ్రామం పెద్ద వ్యాపార కేంద్రంగా మారుతోంది. చుట్టు పక్కల గ్రామాల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

– కొర్ర అరవింద్‌నాయక్, రైతు, మంతన్‌గౌరెల్లి

వచ్చే ఏడాదిలోపు..



జిల్లాలో ప్రస్తుతం ఉన్న 37 పీఏసీఎస్‌లకు అదనంగా మరో 15 కొత్తవి ఏర్పాటు చేయాలని సర్కార్‌కు ప్రతిపాదనలు పంపాం. వచ్చే ఏడాదిలో జరిగే ఎన్నికల్లోపు కొత్తవి ఏర్పాటు చేస్తాం. పీఏసీఎస్‌ల సేవలను రైతులకు మరింత దగ్గరగా చేసి, వారిని ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడమే లక్ష్యం.

– కొత్తకుర్మ సత్తయ్య, డీసీసీబీ చైర్మన్



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఇబ్రహీంపట్నం: క్రమశిక్షణ, పట్టుదలతో చదివి బాలికలు ఉన్నతస్థాయికి ఎదగాలని ఇబ్రహీంపట్నం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ఇబ్రహీంపట్నం న్యాయస్థానం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శంకర్ శ్రీదేవి అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆ సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని శేరిగూడ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతోపాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. బాలికలు, మహిళలకు రాజ్యాంగబద్ధంగా ఉన్న హక్కులు, బాధ్యతలు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. హక్కులు తెలుసుకున్నప్పుడే సమస్యలు ఎదురైతే చట్టపరంగా న్యాయం ఎలా పొందొచ్చనే అంశంపై అవగాహన కలుగుతుందన్నారు. సీనియర్ సివిల్ జడ్జి రిటాలాల్ చంద్ మాట్లాడుతూ.. విజ్ఞానాభివృద్ధికి ఇంటర్నెట్‌ను వినియోగించుకోవాలన్నారు. విద్యార్థుల్లో డిజిటల్ అక్షరాస్యత పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ఈ సందర్భంగా వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. స్కూల్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, ఆ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గురుకుల క్రీడా సంబురం



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

షాద్‌నగర్: కమ్మదనం శివారులోని గురుకుల పాఠశాలలో నాలుగు రోజులుగా ఉత్సాహంగా.. ఉల్లాసంగా సాగిన జోనల్ స్థాయి క్రీడా సంబురం గురువారంతో ముగిసిగింది. ముగింపు వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలకు ఆహూతులను అలరించాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, బాల్‌రాజ్‌గౌడ్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, సర్వర్‌పాషా, మహ్మద్ ఇబ్రహీం, ముబారక్, ప్రిన్సిపాల్ విద్యుల్లత తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న

పథకాలు సకాలంలో అందాలి

జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: షెడ్యూల్డ్ కులాల వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలను సకాలంలో చేరేలా చూడాలని జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ సంబంధిత అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనం సమావేశం మందిరంలో గురువారం కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి షెడ్యూల్డ్ కులాలకు వివిధ పథకాల అమలు తీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు పోస్టుమెట్రిక్స్ స్కాలర్‌షిప్‌లు ఏ మేరకు అందుతున్నాయి.. ఎస్సీ జూనియర్ అడ్వొకేట్లకు ప్రోత్సాహకాలు అందుతున్నాయా.. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా ఎస్సీ కాలనీల్లో రోడ్ల నిర్మాణాలకు ఎంజీఎన్‌ఆర్ స్కీం ద్వారా ఎన్ని నిధులు విడుదలయ్యాయి.. విడుదలైన నిధుల ద్వారా ఎన్ని కాలనీల్లో రోడ్ల నిర్మాణాలు చేపట్టారు తదితర అంశాలపై ఆరా తీశారు.

ఎస్సీల భూములకు రక్షణ కల్పించాలి

ఎస్సీ కులాలకు ఇచ్చిన భూముల పరిరక్షణలో రెవెన్యూ శాఖ దృష్టి సారించాలని సూచించారు. ఎస్సీ,ఎస్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని అన్నారు. ఎవరైనా కేసులు నమోదు చేస్తే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సంక్షేమ పథకాలను ఆయా శాఖలు సకాలంలో ఖర్చుచేసి షెడ్యూల్ కులాల వారి సంక్షేమానికి అన్ని శాఖలు కృషి చేయాలని తెలిపారు. ముందుగా కలెక్టరేట్‌కు చేరుకున్న రాంచందర్ కలెక్టరేట్ ఆవరణలో మొక్కను నాటారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. షెడ్యూల్డ్ కులాల సంక్షేమానికి అన్ని విధాలా తోడ్పాటు అందిస్తామని, ఎక్కడా ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు చేపడతామని తెలిపారు. సమావేశంలో జాతీయ కమిషన్ డైరెక్టర్ సునీల్ కుమార్ బాబు, మహేశ్వరం డీసీపీ సునీత, ఎల్బీనగర్ డీసీపీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జైళ్లకు భయపడే ప్రసక్తే లేదు

- రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోంది
- రైతులు, ప్రజల పక్షాన బీఆర్‌ఎస్ పోరాటం కొనసాగుతుంది
- లగచర్ల కేసుతో సంబంధం లేని వారిపై కేసులు పెడుతున్నారు
- అమాయకులను నిర్బంధించారు
- మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి
- పరిగి జైలులో ఫార్మా బాధిత రైతులకు పరామర్శ



జైలులో ఫార్మా బాధిత రైతులను కలిసి బయటికి వస్తున్న సబితారెడ్డి తదితరులు

పరిగి: ఎన్ని కేసులు పెట్టినా, జైలుకు పంపినా సరే.. రైతుల పక్షాన పోరాటం చేసేందుకు భయపడే ప్రసక్తే లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బాధితులకు అండగా నిలిచేందుకు బీఆర్‌ఎస్ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. పరిగి సబ్ జైలులో ఉన్న ఫార్మా బాధిత రైతులను కలిసి మాట్లాడారు. గురువారం పలువురు మాజీ ఎమ్మెల్యేలతో వెళ్లి బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఘటన ఎలా జరిగింది..? ఎవరిపై కేసులు పెట్టారు.. ఎవరిని అరెస్టు చేసి జైలుకు పంపారు? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఎవరూ బాధపడొద్దని, బీఆర్‌ఎస్ తరఫున తామంతా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. జైల్లో, బయట ఉన్న ఫార్మా బాధితుల పరిస్థితిని చెప్పడం కూడా కష్టంగా ఉందన్నారు. దాడుల్లో పాల్గొనని వారిని సైతం జైలు పాలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అమాయక ప్రజలను కొట్టడంతో పాటు బలవంతంగా కేసులు ఒప్పించి, రిమాండ్ చేయడం అన్యాయమని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వారిని వదిలేసి, బీఆర్‌ఎస్ మద్దతుదారులను లోపల వేశారని మండిపడ్డారు. సీఎం సొంత నియోజకవర్గంలో ఆయనకు ఓట్లేసిన ప్రజలపై కేసులు పెట్టిస్తారా అని నిలదీశారు. ఇంత గొడవ జరుగుతున్నా ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. రైతులకు భరోసా కల్పించాల్సింది పోయి, కేసులు పెట్టించి జైలు పాలు చేస్తారా.. అని నిలదీశారు. లగచర్లతో పాటు తండాల్లో రాత్రివేళ చొరబడిన పోలీసులు, కనిపించిన వారిని కొట్టడంతో పాటు భయానక వాతావరణం సృష్టించారని, కేసుతో ఏ సంబంధం లేని వారిని సైతం పోలీస్ స్టేషన్‌కు తరలించారని తెలిపారు. ఆడపిల్లలు అడ్డం వాస్తే వాళ్లపై కూడా దాడులు చేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం అమాయకులను జైలు పాలు చేయాలని చూస్తోందన్నారు. ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పి పుచ్చుకునేందుకు లేనిపోని కుట్రలు చేస్తున్నారన్నారు.

ఫోన్ మాట్లాడటం నేరమా..?

ఐదేళ్ల పాటు కొడంగల్ ప్రజలకు సేవ చేసిన ఓ మాజీ ఎమ్మెల్యేగా బాధితులు నరేందర్‌రెడ్డికి ఫోన్ చేయడం తప్పా..? ఆపదలో ఉన్నవారికి ధైర్యం చెప్పడం, అండగా ఉంటామని ధీమా ఇవ్వడం మినహా నరేందర్‌రెడ్డి చేసిన నేరం ఏమిటని నిలదీశారు. కేసులు, జైళ్లకు భయపడే ప్రసక్తే లేదని, రాష్ట్ర ప్రజల సంక్షేమం, రక్షణే ధ్యేయంగా బీఆర్‌ఎస్ కొట్లాడుతుందని సబితారెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో కేసీఆర్ నిషాన్ చెరిపేస్తాం అని సీఎం అంటున్నారని, అది ఎప్పటికీ సాధ్యం కాదని తెలిపారు. సీఎం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తమ సమస్యలు చెప్పుకొనేందుకు ఎన్నిసార్లయినా లగచర్ల ప్రజలు నరేందర్‌రెడ్డికి ఫోన్లు చేస్తారని, పూర్తి సమాచారం తెలుసుకోకుండా ఇలా అన్యాయంగా వ్యవహరించడం ఏమిటని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ మాట్లాడుతూ.. నరేందర్‌రెడ్డి తనతో మాట్లాడినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, హరిప్రియనాయక్, కోవ లక్ష్మి, బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓయూ ఆర్ట్స్ కాలేజీ నూతన ప్రిన్సిపల్‌గా ప్రొ.కాశీం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్‌గా తెలుగు శాఖ అధ్యాపకులు ప్రొ.కాశీం నియమితులయ్యారు. యూనివర్సిటీ క్యాంపస్ న్యాయకళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ రాంప్రసాద్, సైన్స్ కాలేజీ ప్రిన్సిపల్‌గా ప్రొ.గుండా ప్రభాకర్ సైఫాబాద్, పీజీ సైన్స్ కాలేజీ ప్రిన్సిపల్ బాటని విభాగం ప్రొ.శైలజ, నిజాం కాలేజీ ప్రిన్సిపల్‌గా జువాలజీ విభాగం ప్రొ.ఏవీ రాజశేఖర్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కాలేజీ ప్రిన్సిపల్‌గా కామర్స్ విభాగం ప్రొ.ఐ.శేఖర్, టెక్నాలజీ ప్రిన్సిపల్‌గా ప్రొ.రమేష్‌కుమార్ నియమితులయ్యారు.

మహిళాభివృద్ధికి కృషి

సీపీఐ మహిళా సమైక్య జిల్లా గౌరవ అధ్యక్షురాలు నీలమ్మ



సభ్యత్వ నమోదులో పాల్గొన్న మహిళలు

చేవెళ్ల: అతివలను చైతన్య పరిచి అభివృద్ధికి మహిళా సమైక్య కృషి చేయాలని సీపీఐ మహిళా సమైక్య జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.నీలమ్మ, ప్రధాన కార్యదర్శి ప్రమిద పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల ఆధ్వర్యంలో మహిళా సమైక్య సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ఇంటింటికి వెళ్లి మహిళా సమాఖ్యలో సభ్యత్వాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజంలో రాజకీయ పరిస్థితులు ఎంతో మారిపోయాయని చెప్పారు. మహిళలు కూడా అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. మహిళలను ఐక్యం చేయాలని భారత జాతీయ మహిళా సమైక్య అనేక సంవత్సరాల నుంచి మహిళల హక్కులకై పోరాటం చేస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ చేవెళ్ల కార్యదర్శి రామస్వామి, మహిళా సమైక్య సభ్యులు లలిత, రమాదేవి, సుగుణమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

పెంచిన నారుకే మొగ్గు

- నర్సరీ మొక్కలను నాటేందుకు ఇష్టపడుతున్న రైతులు
- చీడపీడలను తట్టుకుంటాయని వెల్లడి


నర్సరీలో నారు తీస్తున్న కూలీలు


సర్దార్‌నగర్ నర్సరీలో పెరుగుతున్న నారు

షాబాద్: మారుతున్న కాలానికి అనుగుణంగా సాగు విధానంలో రైతులు కొత్త ఒరవడికి శ్రీకారం చుడుతున్నారు. సంప్రదాయ విధానాలకు స్వస్తి పలికి ఆధునిక పద్ధతులు పాటిస్తున్నారు. విత్తు దగ్గరే చిత్తు కాకుండా నర్సరీలో పెంచిన నారును నమ్ముకుంటున్నారు. రైతుల ఆసక్తికి అనుగుణంగా గ్రామాల్లో ఇటీవల నర్సరీల సంఖ్య క్రమంగా పెరుగుతుంది. చిత్తూరు జిల్లా మదనపల్లె నర్సరీలకు మంచి పేరు ఉంది. అక్కడి నుంచి ప్రతి రోజు వేల మంది రైతులు కూరగాయల నారును కొనుగోలు చేసుకొని తమ ప్రాంతాల్లో సాగు చేస్తుంటారు. నాణ్యమైన నారును ఇస్తుండడంతో వీటికి మంచి ఆదరణ లభిస్తోంది. ప్రస్తుతం షాబాద్ మండలంలోని సర్దార్‌నగర్, షాబాద్, నాగరగూడ, సంకెపల్లి గూడ తదితర గ్రామాల్లో కూరగాయల నారును పెంచే నర్సరీలు పది వరకు ఉన్నాయి. వీటిలో టమాట, వంకాయ, కాలీఫ్లవర్, మిర్చి, క్యాబేజీ తదితర పంటల నారును పెంచి ఇస్తున్నారు. రైతులు విత్తనాలు తెచ్చి ఇస్తే నారును పెంచి ఇవ్వడానికి మొక్కకు 30 పైసల చొప్పున వసూలు చేస్తున్నారు. ఇవ్వకపోతే మొక్కకు 50 పైసలు చొప్పున తీసుకుంటున్నారు. ఎకరా విస్తీర్ణంలో టమాట సాగు చేయాలంటే 9 వేల మొక్కలు అవసరమవుతాయి. నర్సరీల నిర్వాహకులు రూ.3,600 తీసుకొని ఎకరాకు సరిపడే నారును ఇస్తున్నారు.

పెంచే విధానం

విత్తనాలు మొలకెత్తే సమయంలో అధిక ఉష్ణోగ్రత ఉంటే నారు చనిపోతుంది. సాధారణంగా రైతుల పొలాల్లో నారు పెంచే సమయంలో ఇలాగే నష్టపోతున్నారు. చీడపీడల బెడద కూడా ఎక్కువే. నర్సరీలో అయితే ఎండ పడకుండా షెడ్‌నెట్‌లను ఏర్పాటు చేస్తారు. కావాల్సిన సమయంలో నీటిని తుంపర పద్ధతిలో అందిస్తారు. సేంద్రియ ఎరువులు వాడి నారును పెంచడం వల్ల నాణ్యమైన నారును పొందడానికి వీలుంటుంది. పొలాల్లో నారును పెంచడానికి నెల రోజులు పైగా సమయం పడుతుంది. అదే నర్సరీలో అయితే 22–25 రోజుల్లో నారు చేతికి వస్తుంది.

ఖర్చుల వివరాలు

నర్సరీలు ఏర్పాటు చేయడానికి రూ.2 లక్షలు వరకు వెచ్చించాల్సి వస్తుందని నిర్వాహకులు చెబుతున్నారు. వీటిని ఏర్పాటు చేసుకునే రైతులకు ఉద్యానవనశాఖ ద్వారా రూ.50 వేలు రాయితీ అందిస్తుంది. నారును పెంచడానికి షెడ్ ఏర్పాటు నారు పెంచడానికి ప్రత్యేక ట్రేలను కొనుగోలు చేయాలి. టన్ను ఎరువు రూ.5 వేల వరకు ఉంటుంది. నర్సరీల ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. నర్సరీ నిర్వహణకు కనీసం నలుగురు అవసరమవుతారు. పరోక్షంగా మరో పది మందికి ఉపాధి దొరుకుతుంది.

సేంద్రియ పద్ధతి



సేంద్రియ ఎరువులతో నారును పెంచుతున్నాం. దీంతో నాణ్యమైన నారు పొందడానికి వీలుంటుంది. రైతులు ఎక్కువగా నారును కొనుగోలు చేస్తున్నారు. నర్సరీలో ఎండ పడకుండా షెడ్‌నెట్‌లను ఏర్పాటు చేస్తున్నాం. కావాల్సిన సమయంలో నీటిని తుంపర పద్ధతిలో అందిస్తారు.

– అమృత్‌రాజు, నర్సరీ నిర్వాహకుడు, సర్దార్‌నగర్

నాణ్యమైన నారు



నర్సరీలో నారు ఆరోగ్యంగా ఉంటుంది. పంట పొలాల్లో నారు పోస్తే చలికి, వానకు సక్రమంగా మొలకెత్తడం లేదు. సాధారణంగా ఇలాగే నష్టపోతున్నారు. చీడపీడల బెడద కూడా ఎక్కువే. నర్సరీలో అయితే ఎండ పడకుండా షెడ్‌నెట్‌లను ఏర్పాటు చేస్తారు. దీంతో నారు ఆరోగ్యంగా ఉంటుంది.

– వీరప్ప, నర్సరీ నిర్వాహకుడు, నాగర్‌గూడ

నియమ నిబంధనలు తప్పనిసరి


శంకర్‌పల్లి: మాట్లాడుతున్న అధికారులు

వాహనదారులను హెచ్చరించిన పోలీసులు


చేవెళ్ల: ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చేవెళ్ల: రోడ్డుపైకి వచ్చే ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌చార్జి సీఐ గణేశ్, సీఐ భూపాల్ శ్రీధర్, డీఐ రమేశ్‌నాయుడు పేర్కొన్నారు. మండల కేంద్రంలో గురువారం సాయంత్రం సివిల్, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు తమ వాహనంలో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లొదని సూచించారు. డ్రైవర్లు కచ్చితంగా లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలను నడపరాదని ట్రిపుల్ రైడింగ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో చేవెళ్ల సివిల్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి పీఎస్‌లో అవగాహన

శంకర్‌పల్లి: ప్రభుత్వ నిబంధనలను ఆటో, క్యాబ్ డ్రైవర్లు కచ్చితంగా పాటించాలని శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్ గౌడ్, మోకిల సీఐ వీరబాబు, చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌చార్జి సీఐ గణేశ్ అన్నారు. గురువారం శంకర్‌పల్లి పీఎస్ ఆవరణలో ఆటో, క్యాబ్ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు మాట్లాడుతూ.. డ్రైవర్లు కచ్చితంగా యూనిఫాం, డ్రైవింగ్ లైసెన్సు ఉండాలన్నారు. ఆటో, కారుకి ఇన్సూరెన్స్ తప్పనిసరి అన్నారు. డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, అలాంటి వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపొద్దని సూచించారు.

ఆటోలో నుంచి పడి కూలీ మృతి

మొయినాబాద్: ఆటోలో నుంచి ప్రమాదవశాత్తు కిందపడి ఓ వలస కూలీ మృతి చెందారు. ఈ సంఘటన హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై మొయినాబాద్ మండల పరిధిలోని గ్రీన్‌ఫీల్డ్ రిసార్ట్స్ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపుర రాష్ట్రానికి చెందిన స్వపన్‌కుమార్(35) కొంతకాలం క్రితం మొయినాబాద్ మండలానికి వలస వచ్చారు. మండల పరిధిలోని గ్రీన్‌ఫీల్డ్ రిసార్ట్స్‌లో కూలీపని చేస్తూ అక్కడే ఉంటున్నారు. గురువారం మధ్యాహ్నం మొయినాబాద్‌కు వెళ్లి తిరిగి గ్రీన్‌ఫీల్డ్ రిసార్ట్స్‌కు ఆటోలో వెళ్తుండగా ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి కిందపడ్డారు. రోడ్డుపై పడటంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మొయినాబాద్: దంపతులు గొడవ పడి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న భర్త ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని నాగిరెడ్డిగూడలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌కు చెందిన దాసరి రాజా(35), దాసరి జమున దంపతులకు ఇద్దరు మగపిల్లలు. వారు నాగిరెడ్డిగూడలో చదువుతున్నారు. ఈ నెల 8న భార్యాభర్తలు పిల్లలను చూడటానికి గ్రామానికి వచ్చారు. అదే రోజు సాయంత్రం దంపతులు గొడవ పడ్డారు. దీంతో రాజా పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. చికిత్స కోసం అతన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మీదికుంట వాకింగ్ బ్రిడ్జి ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: మియాపూర్ పరిధిలోని మీదికుంట సరస్సు వద్ద నూతనంగా నిర్మించిన వాకింగ్ బ్రిడ్జ్‌ను బాలల దినోత్సవం నేపథ్యంలో ఫౌంటెన్‌హెడ్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ప్రారంభించారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా చేపట్టిన నిధుల సమీకరణతో పాటు స్కూల్ విద్యార్థులు, సేవ్ వాటర్ అండ్ సేవ్ నేచర్ ఎన్‌జీఓ సహకారంతో నిర్మించిన ఈ వంతెనను ప్రారంభించి సమాజానికి అంకితం చేశారు. 2020లో సరస్సు పునరుజ్జీవనం చేసినప్పటి నుంచి సరస్సు పరిరక్షణకు విద్యార్థులు చూపుతున్న అంకితభావాన్ని సరస్సు చుట్టుపక్కల కమ్యూనిటీలు అభినందించాయి.

వ్యక్తి అదృశ్యం


రమేశ్ (ఫైల్)

మొయినాబాద్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి రాకుండా పోయిన సంఘటన మొయినాబాద్ మండల పరిధిలోని చిలుకూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి రమేశ్ క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 12న మధ్యాహ్నం ఆయన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో గురువారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వివాహిత మిస్సింగ్


లావణ్య (ఫైల్)

శంకర్‌పల్లి: ఓ వివాహిత అదృశ్యమైన సంఘటన గురువారం మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం జన్వాడ గ్రామానికి చెందిన శంకరయ్య కూతురు లావణ్య(35)కు 8 ఏళ్ల క్రితం వివాహం జరగ్గా.. కొన్నేళ్ల నుంచి భర్తతో దూరంగా ఉంటుంది. దీంతో ఆమె పుట్టింట్లోనే ఉంది. మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిన ఆమె సాయంత్రం అయినా తిరిగి రాలేదు. తండ్రి చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం మోకిల పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దూసుకొచ్చిన మృత్యువు

- బైక్‌ను వెనక నుంచి ఢీకొట్టిన టూరిస్ట్ బస్సు
- ప్రమాదంలో భార్య దుర్మరణం, భర్తకు తీవ్ర గాయాలు
- చేవెళ్లలోని ఫరా కళాశాల సమీపంలో ఘటన


మంజుల (ఫైల్)

చేవెళ్ల: ఊరికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్న దంపతుల పాలిట ఓ ప్రైవేట్ బస్సు యమపాశమైంది. బైక్‌ను వెనక నుంచి బస్సు ఢీకొట్టిన ఘటనలో భార్య అక్కడికక్కడే మృతి చెందగా, భర్త తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాద సంఘటన మండల కేంద్రంలోని ఫరా కళాశాల సమీపంలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మెండివాగు మంజుల(40), అశోక్ దంపతులు. వీరి కొడుకు చంద్రశేఖర్, కోడలు భార్గవిలకు దీపావళి పండుగ సందర్భంగా అత్తగారు బియ్యం పోశారు. ఈ క్రమంలో నక్కపల్లికి నిద్ర చేసేందుకు బుధవారం అందరూ వెళ్లారు. గురువారం అశోక్, మంజుల ఉదయం 9 గంటలకు బైక్‌పై కొత్తపల్లికి బయలుదేరారు. మార్గ మధ్యలో చేవెళ్లలోని ఫరా కళాశాల వద్ద యూటర్న్ తీసుకుంటుండగా వెనక నుంచి అలీమ్ టూరిస్ట్ పెళ్లి బస్సు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న మంజుల ఎగిరి రోడ్డుపై పడిపోవటంతో ఆమెపై నుంచి బస్సు వెళ్లింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా అశోక్ ఎగిరి దూరంగా పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు గుర్తించి పోలీసులకు అంబులెన్స్‌కు సమాచారం అందించారు. క్షతగాత్రుడిని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం పెద్దాసుపత్రికి మార్చారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన టూరిస్ట్ బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

వేతనాలు చెల్లించాలని డిమాండ్


సింబయాసిస్ యూనివర్సిటీ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

నందిగామ: పనికి తగిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు ధర్నాకు దిగిన ఘటన మండల పరిధిలోని మొదళ్లగూడ శివారులోని సింబయాసిస్ అంతర్జాతీయ యూనివర్సిటీలో గురువారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. యూనివర్సిటీలో పనిచేస్తున్న తమకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని కార్మికులు ఆరోపిస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ.. కొంత కాలంగా యూనివర్సిటీలో పలు పనులు చేస్తున్నామని, తమకు కనీస సౌకర్యాలు గానీ, కనీస వేతనాలు గానీ ఇవ్వడం లేదని అన్నారు. అదే విధంగా కాంట్రాక్టర్ సైతం శ్రమ దోపిడీ చేస్తున్నారని, తమకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ధర్నా చేస్తున్నా కార్మికులకు కొంత మంది కాంగ్రెస్ నాయకులు మద్దతు పలికారు. అనతంరం యూనివర్సిటీ ప్రతినిధి అక్కడకు వచ్చి కార్మికుల సమస్యలను వీలైనంత వెంటనే యాజమాన్యంతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.